ప్రజాశక్తి

బుధవారం 25 సెప్టెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆపరేషన్ మేయర్ !

- కౌన్సిల్‌లో కూటమి పార్టీల కార్పొరేటర్ల హల్‌చల్
- కరోనా టైంలో మేయర్‌కు రూ.10 లక్షలు లంచం అంటూ రాపర్తి అభియోగం
- యుసిడిలో అవినీతిపై విచారణకు కమిషనర్ గ్రీన్‌సిగ్నల్
- మేయర్ పదవిలో ఉండకూడదంటూ సభ్యుల పట్టు
- అభియోగాలొస్తే ఎందుకు రాజీనామా చేయాలి : మేయర్
- సమావేశం నేటికి వాయిదా



మేయర్‌తో వాగ్వాదానికి దిగిన కూటమి కార్పొరేటర్లు



నిరసన తెలుపున్న వైసిపి కార్పొరేటర్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మంగళవారం ఉదయం 10 గంటలకు కౌన్సిల్ హాలులో జరిగిన మొట్టమొదటి మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. అజెండా ప్రారంభం కాకుండానే జీరో అవర్‌లోనే కూటమిలోని టిడిపి, జనసేన, బిజెపి సభ్యులు, వైసిపి సభ్యులు కుమ్ములాడుకున్నారు. ఇప్పటికే స్థాయీ సంఘాల ఎన్నికలను ఏకపక్షం చేసుకున్న టిడిపి కూటమికి చెందిన కార్పొరేటర్లు జివిఎంసి కౌన్సిల్‌లోనూ హల్‌చల్ చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వైసిపికి చెందిన నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారిని టార్గెట్ చేశారు. సమావేశం సజావుగా జరిగేందుకు అవకాశం లేకుండా 'ఆపరేషన్ మేయర్' అన్నట్టుగా దూకుడుగా వ్యవహరించారు. కౌన్సిల్ ప్రారంభంలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి పార్టీలకు అతీతంగా ఫ్లోర్‌లీడర్లు, కార్పొరేటర్లు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు ఘనంగా నివాళులర్పించారు. ఆ తరువాత నూతనంగా సభకు మిగతా 2లో..



ఉక్కు పరిరక్షణ అంశంపై పట్టుబడుతున్న సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

పలువురిలో అసంతృప్తి

- 'నామినేటెడ్' భర్తీలో ప్రగడకు దక్కని పదవి
- గవిరెడ్డి, పైలాకూ అదే పరిస్థితి
- పివిజికి ప్రాధాన్యతలేని పోస్టు
- పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా పీలా, గృహ నిర్మాణ బోర్డు ఛైర్మన్‌గా బత్తుల

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల పట్ల టిడిపి, జనసేన, బిజెపి నాయకత్వం అసంతృప్తితో ఉంది. మంగళవారం ప్రకటించిన నామి నేటెడ్ పోస్టుల విషయమై ఏ పార్టీ నాయత్వమూ ఆనందంగాలేదు. నామినేటెడ్ పోస్టుల నియామకాల్లో బిజెపిని పక్కనబెట్టగా, జనసేనకు సరైన గుర్తింపులేని పోస్టు దక్కింది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా పోటీచేయాలని ఆరాటపడి చివరి నిమిషంలో సీటు దక్కని అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. చోడవరం నియోజకవర్గానికి చెందిన బత్తుల తాతయ్య బాబును గృహ నిర్మాణ బోర్డు ఛైర్మన్‌గా నియమించింది. పౌరసరఫరాల సంస్థ కార్పొరేషన్ సభ్యులుగా పాయకరావుపేట నియోజకవర్గంలోని జనసేనకు చెందిన బొడపాటి శివదత్‌ను, పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ సభ్యులుగా మాడుగుల నియోజకవర్గానికి చెందిన పివిజి.కుమార్‌ను నియమించింది. యలమంచిలి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావుకు ఏ నామినెటెడ్ పదవీ మిగతా 2లో..





నామినేటెడ్ పదవులు దక్కిన పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు

దేశం గర్వించదగ్గ నేత సీతారాం ఏచూరి

వార్త 2లో..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

వార్త 3లో..

కాంట్రాక్టు కార్మికులకు కనీసవేతనాలు అమలు చేయాలి


వార్త 4లో..

ప్రమాదాల నివారణలో

తుపాను హెచ్చరికల కేంద్రం సేవలు ఎనలేనివి

విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రమాదాల నివారణలో భారత వాతావరణ పరిశోధన కేంద్రం, తుపాను హెచ్చరికల కేంద్రం సేవలు ఎనలేనివని, వాటి సహాయంతో ఎన్నో విపత్తులను ఎదుర్కోగలిగామని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎయులోని వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన స్వర్ణోత్సవ వేడుకల్లో భాగస్వామ్యమైన ఆయన సభను ఉద్దేశించి మాట్లాడారు. ఐఎండి మన దేశానికి గొప్ప సేవలు అందిస్తోందని గుర్తు చేశారు. సాంకేతిక సహాయాన్ని మరింత పెంపొందించుకోవటం ద్వారా భవిష్యత్తులో సంభవించే ప్రమాదాలను నివారించుకోవచ్చునన్నారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తక్కువ కాలంలో సంభవించే ప్రమాదాలను నివారించలేంగానీ భవిష్యత్తు కాలంలో జరగబోయే నష్టాలను నివారించగలమని పేర్కొన్నారు. జరగబోయే ప్రమాదాలను ముందుగానే ఊహించి ప్రజలను, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయటంలో తుపాను హెచ్చరికల కేంద్రం కీలకపాత్ర పోషిస్తోందని కితాబిచ్చారు. అయితే మరింత సాంకేతికతను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. విశాఖపట్నం పరిధిలో సుమారు 14 వేల ఇళ్ల కొండవాలు ప్రాంతాల్లో ఉన్నాయని, వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాల్సి ఉందని అన్నారు. జరగబోయే ప్రమాదాలను గుర్తించి, తగిన చర్యలు చేపట్టడంలో లైన్ డిపార్టుమెంట్లు కీలక పాత్ర పోషించాల్సి ఉందని అన్నారు. పిపిపి విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం పెంపుదల, ప్రజల భాగస్వామ్యం, యంత్రాంగాల అప్రమత్తత ప్రమాదాల నివారణలో చాలా అవసరమని పేర్కొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మొదటి పేజీ తరువాయి..

ఆపరేషన్ మేయర్ !

ఎన్నికైన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను సత్కరించారు. ఆ తర్వాత అంతా ఉద్రిక్త వాతావరణమే నెలకొంది.

టేబుల్ అజెండాపై సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పట్టు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేందుకుగానూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను కార్పొరేటర్ల బృందం కలిసి కేంద్రంపై ఒత్తిడి తేవడం కోసం, ప్లాంట్ సెయిల్‌లో విలీనం కోసం తీర్మానం చేయాలని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పట్టుబట్టారు. ఆ విషయమై టేబుల్ అజెండా తొలుత పెట్టి తర్వాత జీరో అవర్ నిర్వహించాలని, ఆస్తి పన్ను తగ్గించేలా, చెత్తపన్నును పూర్తిగా రద్దుచేసేలా సభ్యులు తీర్మానాలు చేయాలని కోరారు. ఆయనకు సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్ మద్దతుగా నిలిచారు. వైసిపి సభ్యులు ఫ్లకార్డులతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలంటూ సభలో నిరసన తెలిపారు.

అసలేం జరిగింది ?

టిడిపి కార్పొరేటర్ రాపర్తి కన్నా జివిఎంసి యుసిడి విభాగంలో అవినీతి గురించి చేసిన ఆరోపణలతో కౌన్సిల్‌లో పెద్ద దుమారం రేగింది. ఆదాయపు పన్ను క్లెయిమ్ చేసిన సొమ్ము కార్మికుల అకౌంట్లలో జమ చేయకుండా ఎస్‌ఎల్‌ఎఫ్ విభాగం వారు తమ అకౌంట్లలో ఉంచుకుని అవకతవకలకు పాల్పడ్డారని, కార్మికుల పొట్టకొట్టారని ఆయన ఆరోపించారు. కరోనా కాలంలో మాస్కుల తయారు చేసిన వారికి చెల్లింపులు జరపకుండా, పునరావాస కేంద్రాల్లో ఉన్నవారి పేర లక్షలాది రూపాయలు చెల్లింపులు చేసి అవినీతికి పాల్పడ్డారని, పై మొత్తం అవినీతిపై విచారణ కోసం 2023లోనే రాష్ట్ర మెప్మా డైరెక్టర్‌కు, విశాఖ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కాగా, ఈ విచారణ జరగకుండా ఉండేందుకు అప్పటి జివిఎంసి కమిషనర్‌కు రూ.5లక్షలు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి రూ.10 లక్షలు లంచాలు ముట్టాయని సిబ్బందిలో చర్చ జరిగిందన్న విషయం ఆ ఫిర్యాదులో ఉందని రాపర్తి కౌన్సిల్‌లో వెల్లడించారు. దీంతో సభలో ఒక్కసారి గందరగోళం నెలకొంది. కమిషనర్ సంపత్‌కుమార్ వీటిపై తాను విచారణ జరిపి నివేదిక ఇస్తానని ప్రకటించారు. అయితే, విచారణను మేయర్ స్థానంలో ఉండి ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున మేయర్ రాజీనామా చేయాలని టిడిపి, జనసేన, బిజెపి సభ్యులంతా పట్టుపట్టారు. వైసిపి సభ్యులు అడ్డుపడుతూ అభియోగం వచ్చినంత మాత్రాన రాజీనామా కోరడం సరైంది కాదంటూ వాదించారు. పోడియం వద్దకొచ్చి కూటమి సభ్యులు నిరసన తెలిపారు. ఆరోపణలకే రాజీనామా చేయాల్సి వస్తే టిడిపి కార్పొరేటర్లందరి మీదా తనకు ఫిర్యాదులొచ్చాయని, వారూ చేయాలని ఆగ్రహంతో మేయర్ హరివెంకటకుమారి అన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు 10 నిమిషాలు బ్రేక్ ఇచ్చారు. ఆ తర్వాత మేయర్ రాగానే ముందుటి నినాదాలే కూటమి కార్పొరేటర్ల నుంచి వినిపించడంతో సభను బుధవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

ప్రజా సమస్యలపై చర్చ జరగాలి : సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

ఎంవిపి.కాలనీ : ఎన్నికల అనంతరం ఆరు నెలల సుదీర్ఘ విరామం తరువాత నిర్వహిస్తున్న జివిఎంసి కౌన్సిల్ సమావేశం అర్ధాంతరంగా వాయిదా పడటంపై సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలుగా జివిఎంసిలో జరుగుతున్న అక్రమాలపై సిపిఎం తరుపున ఎన్నోసార్లు వినతి పత్రాలు ఇచ్చామని, నిరసనలు తెలియజేశామని తెలిపారు. అధికార, విపక్షాలు ఏనాడూ వాటి పరిష్కారం దిశగా అడుగులు వేయలేదని అన్నారు. ఓ పక్క ప్రజలపై చెత్త పన్ను, ఆస్తి పన్ను భారాలు పడుతున్నాయన్నారు. అవినీతి పెచ్చుమీరిందని తెలిపారు. వీటిపై టిడిపి, వైసిపి కార్పొరేటర్ల తీరు ఒకేలా ఉందన్నారు. ఏది ఏమైనా ప్రజా సమస్యలపై చర్చించి ముందుకు వెళ్లాల్సిన సమావేశం అర్ధాంతరంగా వాయిదా పడటం తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. కౌన్సిల్ సభ్యులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపించాలని సూచించారు. ఏది ఏమైనా జరిగిన అవినీతిపై విచారణ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని, కార్మికులకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని తెలిపారు.

పలువురిలో అసంతృప్తి

ఇవ్వకపోవడంతో ఆయన, అనుచరులు అసంతృప్తితో వున్నారు.

కూటమి తరుపున జనసేన నుంచి సుందరపు విజయ్‌కుమార్ పోటీచేయడంతో యలమంచిలి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాల్సిన ప్రగడ నాగేశ్వరరావు వెనక్కు తగ్గాల్సి వచ్చింది. పార్టీ అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవిఇచ్చి గౌరవిస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో బుజ్జగించడంతో ఆయన మాట నమ్మి ప్రగడ సర్దుకుపోయారు. కానీ నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఆయనకు ఏ పదవీ ఇవ్వకపోవడంతో అవమానపర్చినట్లుగా ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. మాడుగుల నుంచి పోటీలోవున్న పైలా ప్రసాదరావును తప్పించి పెందుర్తి సీటురాని బండారు సత్యనారాయణమూర్తిని మాడుగుల నుంచి చంద్రబాబు పోటీ చేయించారు. ఎన్నికల్లో కలిసిపనిచేసేలా ప్రసాదరావు సహా మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పివిజి.కుమార్‌కు గౌరవ ప్రదమైన స్థానం కల్పిస్తామని అప్పట్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు పివిజి.కుమార్‌ను ప్రాధాన్యతలేని టూరిజం అభివృద్ధి కార్పొరేషన్ సభ్యునిగా నియమించి చేతులు దులుపుకోగా, పైలా, గవిరెడ్డికి ఏ పదవీ లభించలేదు.

అనకాపల్లి సీటు జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణకు కేటాయించడంతో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పోటీచేసే అవకాశం కోల్పోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్సీ పదవి ఇస్తారని పీలా ఆశపడ్డారు. కొద్ది రోజుల క్రితం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీలాను బరిలో దించుతున్నట్లు ప్రచారం జరిగింది. తగిన బలంలేకపోవడంతో చివరి నిమిషంలో టిడిపి పోటీ నుంచి తప్పుకుంది. అయితే, ఏదో ఒక కోటాలో తనకు ఎమ్మెల్సీ పదవి వస్తుందని భావించిన పీలా కోరిక నెరవేరలేదు. ఆయనను పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించడంతో ఎమ్మెల్సీ ఆశ నీరుగారినట్లయింది. చోడవరం టిడిపి ఎమ్మెల్యేగా పోటీ చేయాల్సిన బత్తుల తాతయ్యబాబును కాదని ఎన్నికలకు సమీపంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్‌ఎన్‌ఎస్.రాజును బరిలో పెట్టింది. తాతయ్య బాబును సంతృప్తిపర్చేందుకు నామినేటెడ్ పదవి ఇస్తామని చెప్పి గృహ నిర్మాణ బోర్డు ఛైర్మన్‌గా చంద్రబాబు నియమించారు.

దేశం గర్వించదగ్గ నేత సీతారాం ఏచూరి

జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో ఘన నివాళి



జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో నివాళ్లర్పిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశం గర్వించదగ్గ నేత సీతారాం ఏచూరి అని సిపిఎం, సిపిఐ, తెలుగుదేశం, బిజెపి, వైసిపి, జనసేన పార్టీల ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, రాజ్యసభ సభ్యులు, ఎంఎల్‌సిలు, ఎమ్మెల్యేలు అన్నారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి అత్యంత విషాదం నింపిందని, పేద ప్రజలు, కష్టజీవులు, కార్మికుల కోసం అహర్నిశలూ ఆలోచనలు సాగించే ఆయన ఇలా అర్ధాంతరంగా కన్నుమూయడం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జివిఎంసి కౌన్సిల్ సమావేశం ప్రారంభంలో ఏచూరికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అందరూ ఘన నివాళులర్పించారు. జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఏచూరికి నివాళులర్పిస్తూ తొలుత తీర్మానం ప్రవేశపెట్టారు.

దేశం మహానాయకుడిని కోల్పోయింది : బొత్స

మాజీ మంత్రి, ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ దేశం ఏచూరి మృతితో మహా నాయకుడిని కోల్పోయిందని, ఆయన ఆలోచనలు దేశాన్ని ముందుకు నడిపించడానికి ఎంతో దోహదపడ్డాయని తెలిపారు. ఆయన ఉపన్యాసాలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందినవాడిగా ప్రతి తెలుగువాడూ ఏచూరిని చూసి గర్వించాలన్నారు. బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఏచూరి మృతి దేశ శ్రామిక జనానికి తీరని లోటు అని అన్నారు. టిడిపి కార్పొరేటర్ పీలా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ, దేశ చరిత్రలో తెలుగువానిగా ఏచూరి పేరు చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. వైసిపి కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధికి సీతారాం ఏచూరి మహోన్నత భావజాలం ఎంతగానో దోహదపడుతుందన్నారు.

శ్రీలంకలో విజయం వెనుక ఏచూరి : డాక్టర్ బి గంగారావు

సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ శ్రీలంకలో మార్క్సిస్టు నేత దిసనాయకే అధ్యక్షునిగా గెలవడం, ఎర్రజెండా రెపరెపలాడటం నేడు చూస్తున్నామన్నారు. సీతారాం ఏచూరి ఆ దేశం సంక్షోభం నుంచి బయటపడేందుకు చేసిన దిశానిర్దేశం ఎంతగానో దోహదపడిందన్నారు. ఏచూరి ప్రియశిష్యుడైన మార్క్సిస్టు నేత అనుర కమార దిసనాయకే శ్రీలంక అధ్యక్షునిగా ఎన్నికయ్యారన్నారు. దేశంలో ఫెడరల్ వ్యవస్థకు, లౌకిక పునాదులకు దెబ్బ తగులుతున్న ప్రస్తుత నేపథ్యంలో ఏచూరి లాంటి నాయకుడు లేకపోవడం బాధాకరమన్నారు. సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్ మాట్లాడుతూ ఏచూరి ఈ దేశ మౌలిక సమస్యలపై చదువుకున్న రోజుల నుంచీ అవగాహన కలిగి ఉన్నారన్నారు.

దేశానికి తీరని లోటు : ఎంఎల్‌సిలు గొల్ల బాబూరావు, కుంభా రవిబాబు

పేద ప్రజల తరపున చట్టసభల్లో నిలబడి ప్రజాకర్షణ కలిగిన నేతగా ఏచూరికి అత్యున్నత గుర్తింపు ఉందని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు ఉద్ఘాటించారు. ఏచూరి అభ్యుదయ భావజాలం ఈ దేశాన్ని నడిపించే శక్తివంతమైన ఆయుధమన్నారు. ఎంఎల్‌సి వరుదు కల్యాణి మాట్లాడుతూ ఆయన ఆశయాల కోసం ఈ తరం కృషిచేయడమే ఆయనకు అర్పించే ఘన నివాళి అన్నారు.

ఏచూరికి సంతాపం తెలుపుతూ ప్రసంగించిన వారిలో బిజెపి కార్పొరేటర్ గంకల కవిత, జనసేన కార్పొరేటర్లు కందుల నాగరాజు, భీశెట్టి వసంత లక్ష్మి, వైసిపి కార్పొరేటర్ రోహిణి ఉన్నారు.

తల్లీ బిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి -యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లల్లో రక్తహీనత లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పోషకాహార స్థితిపై దృష్టి సారించి, లోపాన్ని పరిష్కరించడానికి రాష్ట్రీయ పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ఈ నెల 1 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా రక్తహీనతపై అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు గొండు సీతారామ్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ జి.జయలక్ష్మి, సిడబ్ల్యుసి మెంబర్ రజని, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి, సిడిపిఒలు, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.


పోషకాహారాన్ని పరిశీలిస్తున్న గీతం ప్రతినిధులు

పోషకాహారంతో ఆరోగ్యకర సమాజం

మధురవాడ : పోషకాహారంతో ఆరోగ్యకర సమాజం నిర్మితమవుతుందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్చార్జి వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు పేర్కొన్నారు. గీతం సెంటర్ ఫర్ హెల్త్ అండ్ వెల్నెస్ ఇన్నోవేషన్స్ మహిళాసాధికారిక విభాగం, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ జీవ శాస్త్ర విభాగం, జిమ్మర్ సామాజిక వైద్య విభాగం సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన జాతీయ పోషకాహార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గీతం విద్యార్థులతో పాటు నగరంలోని పలు ఆహార ఉత్పత్తుల సంస్థలు ఏర్పాటుచేసిన స్టాళ్లను ఆయన గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్‌తో కలిసి ప్రారంభించారు. జంక్ ఫుడ్ స్థానంలో సూక్ష్మ పోషకాలు, చిరు ధాన్యాలతో తయారైన వివిధ ఆహార పదార్థాలను రోజువారి జీవితంలో తప్పనిసరిగా వినియోగించటం ఆరోగ్యానికి మంచిదన్నారు. కార్యక్రమంలో గీతం మహిళా సాధికారిక విభాగం ఛైర్‌పర్సన్ డాక్టర్ శ్రీవిద్య, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ జీవ శాస్త్ర విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


మృతిచెందిన ప్రవీణ్, ప్రశాంత్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ఒకరి పరిస్థితి ఆందోళనకరం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కంచరపాలెం జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు కంచరపాలెం ట్రాఫిక్ సిఐ దాశరథి కథనం ప్రకారం... మంగళవారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో ఊర్వశి జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం వైపుగా ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో సంజయ్‌నగర్, జాతీయ రహదారి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న సీతంపేటకు చెందిన ప్రవీణ్ (24), మధ్యలో కూర్చున్న కంచరపాలేనికి చెందిన ప్రశాంత్ (22) అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక కూర్చున్న కంచరపాలేనికి చెందిన మహేష్ (20)కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని స్థానికులు గమనించి గాయాల పాలైన మహేష్‌ను 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఈ సంఘటనలో ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి వాహనం కిలో మీటర్ మేర దూసుకుపోయింది. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ట్రాఫిక్ సిఐ దాశరథి నేతృత్వంలో కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

10న బతుకమ్మ సంబరాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలోని సీ భవన్‌లో అక్టోబర్ 10వ తేదీన సాయంత్రం 6 గంటలకు బతుకమ్మ సంబరాలను నిర్వహించనున్నట్లు ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం తెలిపింది. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన బ్రోచర్లను మంగళవారం ఉక్కునగరంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారు ఎన్.వీరేశం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.కుమారస్వామి, జి.ఆనంద్, ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, ఎంకెవిఆర్.మోహనరావు, ఎన్.నర్సింగరావు, సిహెచ్.రవికుమార్, భిక్షం, ఎం.వేణుగోపాల్, జి.పరమేష్ పాల్గొన్నారు.


సింహాచలం కొండపై ఏర్పాటుచేసిన వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -గోపాలపట్నం : సిఐటియు, అల్లూరి విజ్ఞాన కేంద్రం, ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యాన సింహాచలం కొండపై మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. సిఐటియు గోపాలపట్నం జోన్ కార్యదర్శి కీర్తిశేషులు పైడా సత్యనారాయణ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని సిఐటియు గోపాలపట్నం కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు బలివాడ వెంకటరావు మాట్లాడుతూ, పైడా సత్యనారాయణ కార్మికుల కోసం అలుపెరగని పోరాటం చేశారన్నారు. సత్యనారాయణ ఆశయాలకు అనుగుణంగా అతని భార్య సూర్యకాంతం పనిచేయడం అభినందనీయమన్నారు. మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఈసీజీ, కేన్సర్, నేత్ర పరీక్షలు నిర్వహించారు. సింహగిరి కొండపైన గిరిజనులు ఈ సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎవి.ప్రసాదరావు, పి.అనసూయ, సత్యనారాయణ సతీమణి సూర్యకాంతం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములు పత్రాల పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలో గతంలో ఫ్రీ హోల్డ్‌లో ఇచ్చిన భూములు ప్రభుత్వ ఉత్తరుల ప్రకారం సర్వే అయిందా లేదా అనే విషయంపై ఆనందపురం మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. వీఎంఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్ కీర్తి, లక్ష్మారెడ్డి, విశాఖ ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ పత్రాలను పరిశీలించారు. గండిగుండం రెవెన్యూ పరిధిలో సుమారు100మంది రైతులు భూముల పత్రాలను, భీమన్నదొరపాలెం 14 మంది రైతుల పత్రాలను మొత్తంగా 131 ఎకరాలకు సంబంధించి పరిశీలించారు. వాటిలో ఎంత మేర రిజిస్ట్రేషన్ చేశారు.. నిజమైన రైతులా కాదా.. లేదా జిపి కం సేల్ చేశారా వివరాలన్నీ పరిశీలిస్తున్నామని వీఎంఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్ కీర్తి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తనిఖీలు నిర్వహించి, ఫీల్డ్‌లో ఉన్నారా లేదా విచారించి పూర్తిస్థాయి నివేదికను తయారుచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల తహశీల్దార్ పేర్ల శ్యాంప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్ కీర్తి

2 నుంచి జూ పార్కులో వన్యప్రాణి వారోత్సవాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మంగళవారం తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణ, విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉత్తేజకరమైన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డబ్ల్యుసిటిఆర్‌ఐ, వైజాగ్ రైటర్స్, గ్రీన్ క్లైమేట్ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించే పోటీలకు విద్యార్థులతో పాటు ప్రజలు పాల్గొనవచ్చని వివరించారు. బర్డ్‌వాక్, సీతాకోక చిలుకల వర్క్‌షాపు, రంగోలి, సీడ్ బాల్స్ మేకింగ్ వంటి కార్యక్రమాల్లో అన్ని వయసుల వారు పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లతో పాటు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 7893632900 నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఎంవిఆర్‌లో ఉచిత దంత పరీక్షలు


ఎంవిఆర్ కళాశాలలో దంత పరీక్షలు చేస్తున్న దంత వైద్యులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలోని ఎంవిఆర్ కళాశాలలో వి డెంటల్ కేర్ ఆధ్వర్యాన మంగళవారం విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ వి.రామారావు మాట్లాడుతూ, చిగుళ్ల వ్యాధి బారిన పడకుండా విద్యార్థులు చర్యలు తీసుకోవాలన్నారు. దైనందిన జీవితంలో దంతాలపై కూడా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వి డెంటల్ కేర్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ ఎ.బాలకృష్ణ, వి.తేజేశ్వరరావు, ఎస్‌వి.కృష్ణ పాల్గొన్నారు.

గీతంలో ఇండియన్ బ్యాంక్ రుణమేళా

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బోధన, బోధనేతర సిబ్బందికి ప్రత్యేకంగా గృహ, వాహన రుణాలను అందించేందుకు ఇండియన్ బ్యాంక్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రుణమేళాను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ద్వారా అందిస్తున్న వివిధ రుణాలను, సీనియర్ సిటిజన్లకు అందిస్తున్న పథకాలను అధికారులు ఆయనకు వివరించారు. తక్కువ వడ్డీతో గీతం ఉద్యోగస్తులకు రుణాలు అందించడం పట్ల బ్యాంకును అభినందించారు. కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ అవదేష్ పూర్వే, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సంతోష్‌కుమార్, గీతం బ్యాంక్ శాఖ మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటం అందజేత

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్ర పటం అమర్చాలని కోరుతూ ప్రధానోపాధ్యాయులు పొట్నూరు మురళీమోహనరావుకు స్థానిక టిడిపి ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ దండి వెంకటేష్ ఆధ్వర్యాన దళిత యువ నాయకులు బోని కార్తీక్ మంగళ వారం అంబేద్కర్ చిత్ర పటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఒకటో వార్డు టిడిపి అధ్యక్షులు తమ్మిన సూరిబాబు, పార్టీ నాయకులు నరవ రామారావు, కొప్పల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి గ్రామ పంచాయతీలోని వెంకటాపురం స్కూల్ విద్యార్థులకు స్వచ్ఛతపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. మొదటి బహుమతి కె.జ్ఞానవర్ధన్, రెండో బహుమతి కె.జాహ్నవి, మూడో బహుమతి కె.రామమౌళి గెలుపొందారు. ఈ కార్యక్రమంలోసచివాలయ సిబ్బంది సురేష్‌బాబు, చిట్టిబాబు, కూటమి నాయకులు తాడివాడ ప్రశాంత్ కుమార్, సుంకర శివ, దొంతల శ్రీరామ్, పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి -తగరపువలస : ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి ఆటో కార్మికులకు సూచించారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద షిరిడి సాయి ఆటో కార్మిక సంఘం (సిఐటియు) సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి హాజరై మాట్లాడుతూ, విద్యార్థులను, ప్రయాణికులను ఆటోల్లో తీసుకెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రయాణికులతో మర్యాదగా మెలగాలన్నారు. సిఐటియు జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి మాట్లాడుతూ, ఆటో కార్మికుల సమస్యలను వివరించారు. అనంతరం ట్రాఫిక్ ఎస్ఐని ఆటో కార్మికులు సత్కరించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఎస్.అప్పలనాయుడు, సంఘం గౌరవాధ్యక్షులు నీలాటి రాము, అధ్యక్షులు పల్లా పెంటరాజు, ఉపాధ్యక్షులు నమ్మి నాయుడు, సహాయ కార్యదర్శి మహేష్, కోశాధికారి నమ్మి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఇంటర్వ్యూలు 30కి వాయిదా

ప్రజాశక్తి-లీగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన చేపట్టనున్న ఆఫీసు అసిస్టెంట్ (3), రిసెప్షనిస్ట్ - కమ్ - డేటా ఎంట్రీ ఆపరేటర్ (1), ఆఫీసు సబార్డినేట్ (3) ఉద్యోగాల నియామకాలకు ఈ నెల 26, 27వ తేదీల్లో నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు ఈ నెల 30వ తేదీకి వాయిదా పడినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి ఎంవి.శేషమ్మ తెలిపారు.

చింతగట్ల టిడిపిలో కోల్డ్ వార్

ప్రజాశక్తి-పెందుర్తి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ప్రతిపక్ష నాయకులు అధికార పార్టీలోకి ఒక్కొక్కరుగా చేరిపోతున్నారు. దీంతో టిడిపిలో కోల్డ్‌వార్ మొదలవుతోంది. చింతగట్ల పంచాయతీ సర్పంచ్ భర్త గలిశెట్టి కనకరాజు టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. దీన్ని చింతగట్ల, ఇప్పిలివానిపాలెం, జెర్రిపోతులపాలెం టిడిపి నాయకులు వ్యతిరేకిస్తున్నారు. గండి బాబ్జి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మొదటి నుంచి టిడిపి కోసం ఎన్నో కష్టాలు పడ్డామని, వైసిపి అరాచకాలతో జైలుకు కూడా వెళ్లామని, తమను సంప్రదించకుండా వైసిపి నాయకులను చేర్చుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి తమ ఆవేదనను వెలిబుచ్చారు. సోమవారం సాయంత్రం నాయకులంతా చర్చలు జరుపుకొని గండి బాబ్జి తీరుపై మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లడానికి సిద్ధమవుతున్నారు. అధికారం లేనప్పుడు ఎన్నో కష్టాలు అనుభవించిన తమను ఇప్పుడు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పెదగాడి సర్పంచ్ భర్త త్రినాథ్ కూడా వచ్చే నెల 10వ తేదీన టిడిపిలో చేరడానికి సిద్ధమవుతున్నారు. మళ్లీ వైసిపి నాయకులే చక్రం తిప్పితే ఇన్నాళ్లు పార్టీని మోసిన తమ పరిస్థితి ఏంటని టిడిపి నాయకులు వాపోతున్నారు.

రైతుబజార్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార రైతుబజార్‌లో జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి యాసిన్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంగళవారం రైతు బజార్‌కు సెలవు కావడంతో వినియోగదారుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. ప్రతి మంగళవారం కూడా రైతు బజార్ అందుబాటులో ఉంటుందని, ప్రజలు గమనించి వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం రైతులతో సంభాషించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్

కాంట్రాక్టు కార్మికులకు కనీసవేతనాలు అమలు చేయాలి

ప్రజాశక్తి -ములగాడ : కాంట్రాక్టు కార్మికులకు కనీసవేతనాలు అమలు చేయాలని సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. ఈ నెల 30వ తేదీన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ హెచ్‌పిసిఎల్ లేబర్ గేటు వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న కాంటాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పర్మినెంట్ స్వభావం గల పోస్టుల్లో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెచ్‌పిసిఎల్, షిప్‌యార్డు, డాక్ యార్డు కోరమండల్ తదితర పరిశ్రమల్లో కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జిఒ సవరించి జీతాలు పెంచాలని, కార్మికులకు నష్టం కలిగించే 4 లేబరు కోడ్స్ రద్దు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ పటిష్టంగా అమలుచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సేఫ్టీ సౌకర్యాలు కల్పించి ప్రమాదాలు అరికట్టాలని, స్థానికులకు ఉపాధికల్పించాలని, జిఒ ప్రకారం జీతాలు చెల్లించాలని తదితర డిమాండ్లతో చేపట్టే మహాధర్నాలో వేలాదిగా కార్మికులు పాల్గొనాలని కోరారు. పోస్టల్ ఆవిష్కరణలో సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు, హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.కృష్ణారావు, సిఐటియు కార్యకర్తలు బి.శ్రీను, ఎం.కోటేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మణమూర్తి తదితరులు

ఇందిరాగాంధీని వ్యతిరేకించిన నేత సీతారాం ఏచూరి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-పెందుర్తి : ఇందిరాగాంధీ నిర్ణయాన్ని వ్యతిరేకించిన గొప్ప నేత సీతారాం ఏచూరి అని సిపిఎం పెందుర్తి జోన్ కార్యదర్శి బి.రమణి పేర్కొన్నారు. జివిఎంసి 95వ వార్డు పరిధి జ్యోతినగర్‌లోని సిపిఎం కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి, ఐద్వా నాయకులు అనంతలక్ష్మి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు సీతారాం ఏచూరితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రమణి మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాన్ని ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లిన మహనీయుడు అని కొనియాడారు. ఐద్వా నాయకులు అనంతలక్ష్మి మాట్లాడుతూ, సీతారాం ఏచూరి ప్రభావం ఎంతో మందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దేవి, విజయలక్ష్మి, చిన్నమ్మలు, త్రినాధమ్మ, గంగమ్మ, అక్కమ్మ, పైడిరాజు, మధు తదితరులు పాల్గొన్నారు.



చెత్తను ఏరుతున్న విద్యార్థులు

ఎన్ఎస్ఆర్ఐటిలో ఎన్ఎస్ఎస్ డే

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటి)లో ఎన్ఎస్ఎస్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మొక్కలు నాటారు. కళాశాల, బస్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, కరస్పాండెంట్ డాక్టర్ పిఎస్.రాజు, పిఒ హరగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు ఢిల్లీశ్వరరావు, ఇతర ఆధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు పైడా సత్యనారాయణ వర్ధంతి సభ

ప్రజాశక్తి -గాజువాక : మిందిలోని గురజాడ కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు అరుణోదయ కళా సమితి వ్యవస్థాపకులు పైడా సత్యనారాయణ ప్రథమ వర్ధంతి సభ జరపనున్నట్లు అరుణోదయ కళా సమితి నాయకులు సిగటాపు అప్పలరాజు, వర్రి వెంకట్రావు తెలిపారు. వర్ధంతి సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, భెల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి.ప్రకాష్, వైసిపి నాయకులు లతీష్ హాజరవుతారని తెలిపారు. సభ అనంతరం విశాఖ తెలుగు అకాడమీ రూపొందించిన నిశ్శబ్దమా? నీ ఖరీదు ఎంత సాంఘిక నాటకాన్ని అరుణోదయ కళాశాల ఆధ్వర్యాన ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



కాపులుప్పాడలో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి వరి పంటపే సందర్శించిన ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు.

ఆనందపురం : మండలంలోని వెల్లంకి, వేములవలస గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి మాట్లాడుతూ, ప్రతి మంగళ, బుధవారాల్లో ఉదయం ఒక గ్రామం, మధ్యాహ్నం ఒక గ్రామం చొప్పున రెండు రోజులు వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పర్యటించి రైతులతో చర్చించి తగు సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు. ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎపిఎంఐపి పీడీ మన్మధరావు మాట్లాడుతూ, డ్రిప్, స్ప్రింకలర్ కావలసిన వారు రైతు సేవాకేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లా ఉద్యానవన అధికారి కె.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, షేడ్ నెట్స్ ఉపయోగించి రైతులు అధిక ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. మండల వ్యవసాయ అధికారి సిహెచ్.సంధ్య రత్న ప్రభ వరిలో ఆశించే చీడ పీడల నివారణ గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయ సాగు, మార్కెటింగ్ గురించి ఎన్ఎఫ్ఎ శ్రీనివాస చక్రవర్తి వివరించారు. ఈ సందర్భంగా అధికారులు పొలాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రామారావు, వెల్లంకి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ కంచరపు శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు పడాల అప్పలనాయుడు, బిపివి కల్లాలు సర్పంచ్ కోన పైడిరాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పద్ధతులను అనుసరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రైతులకు సూచించారు. నాలుగు నెలల పాటు జరుగనున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని జివిఎంసి నాలుగో వార్డు పరిధి కాపులుప్పాడలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విత్తనం నాటిన నుంచి పంట చేతికి వచ్చేవరకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను రైతులు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పంట నమోదు చేయించుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులు, రైతులతో కలిసి ఎమ్మెల్యే వరి పంట పొలాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్, డిఆర్‌సి ఎడిఎ చదువుల సుబ్రమణ్యం, డిపిఎం మోహనరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ముందుగా జెండా ఊపి పొలం పిలుస్తోంది ప్రచార వాహనాన్ని ఎమ్మెల్యే గంటా ప్రారంభించారు.

కొత్తకోట : రావికమతం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో టి. అర్జాపురం, కొట్నా బిల్లి తదితర గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంఠ కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం పరిశోధన సంస్థ శాస్త్రవేత్త ఎ.సౌజన్య పాల్గొని,గిరిజన రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడి ఉంటుందని అవగాహన కల్పించారు. భూసంరక్షణతో ఆరోగ్యకరమైన పంట దిగుబడుల సాధనకు సూచనలు చేశారు. పశు వైద్యాధికారి డాక్టర్ విఎస్ఎన్‌వి రావు మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సోకకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధి నివారణకు అవసరమైన మందులు, వ్యాధి రాకుండా టీకాలు అందుబాటులో ఉన్నాయని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు విఎఎ రత్నం పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని పాతమల్లంపేటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి సుధారాణి మాట్లాడుతూ వరి పొలాల్లో కాలి బాటలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీనివలన గాలి, వెళుతురు సక్రమంగా అంది వరి దుబ్బులు ఏపుగా పెరిగి దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్ గోవిందు పలువురు రైతులు పాల్గొన్నారు

పరవాడ : మండలంలోని పరవాడ, వెన్నెలపాలెం గ్రామాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. చీడపీడలను, పోషక లోపాలను గమనించి తదనుగుణంగా సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి సిహెచ్.చంద్రావతి, గ్రామ సర్పంచ్ శిరిపురపు అప్పలనాయుడు పెద్దలు పైల రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, పైల అప్పలనాయుడు, కూండ్రపు స్వామి నాయుడు, రెడ్డి ఎర్నాయుడు, పైల అప్పలనాయుడు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఎఎస్‌పేట, బయ్యవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శాస్త్రవేత్తలు చంద్ర శేఖర్ పాల్గొని పొలాల పరిశీలించి తెగులు, పురుగులు నివారణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు టి రామారావు, మురళి, శ్రీధర్, స్వప్న పాల్గొన్నారు.

దేవరాపల్లి : పొలంబడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మారేపల్లి, చేనుల పాలెం గ్రామాల్లో సూక్ష్మ, బిందు సేద్యం విభాగం నుండి అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో కాంతమ్మ, వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ఎప్పటికప్పుడు రైతులు తమ పంటల యాజమాన్యం పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి రంగాచారి పేర్కొన్నారు. మండలంలో కూండ్రం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అనకాపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు రామారావు, మురళి, శాస్త్రవేత్త చంద్రశేఖర రావు, పశుసంవర్ధక శాఖ వైద్యులు రామారావు, ఉద్యాన శాఖ లావణ్య, సర్పంచ్ నందారపు లక్ష్మీ సూరిబాబు, ఎంపీటీసీ జెట్టి నాగమణి అప్పారావు, ఈశ్వరమ్మ నాయుడు, సత్యనారాయణ సంతోష్ పాల్గొన్నారు.

2 నుంచి ఉక్కు పరిరక్షణకు నిరాహార దీక్షలు

- అఖిలపక్ష కార్మిక, రైతు, ప్రజా సంఘాలు
- అనకాపల్లి జిల్లాలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఏర్పాటు



అభివాదం చేస్తున్న అఖిలపక్ష కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

విశాఖ ఉక్కు పరిరక్షణకు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 నుంచి 4 తేదీల్లో నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు అఖిలపక్ష కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు అధ్యక్షతన సిఐటియు, ఏఐటీయూసీ, రైతు సంఘం, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డివైఎఫ్ఐ, రైతు స్వరాజ్య వేదిక, ఏఐఎఫ్టీయూ తదితర సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఏర్పడింది. కమిటీ జిల్లా కన్వీనర్‌గా ఆర్.దొరబాబు, కో కన్వీనర్‌గా ఆర్.శంకర్రావు, సభ్యులుగా కర్రి అప్పారావు, రెడ్డిపల్లి అప్పలరాజు, బాలు గాడి, ఎం.రమణ, డిడి వరలక్ష్మి, పి.మాణిక్యం, జి కోటేశ్వరరావు, కే.శంకర్రావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేట్ పరం కానివ్వమని ఒకపక్క కేంద్ర రాష్ట్ర మంత్రులు చెబుతూనే మరోవైపు విశాఖ స్టీల్ ప్లాంట్‌ని నష్టాల ఊబిలోకి నెడుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికే రెండు బ్లాస్ట్ ఫర్నేస్లు మూసేశారని, కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని మండిపడ్డారు. ముడిసరుకు సప్లైకి నిధులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. విశాఖ ఉక్కుకి కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించకుండా తాత్సారం చేస్తున్నదని విమర్శించారు. కావాలనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారని, దీనికి నిరసనగా అక్టోబర్ 2 నుండి 4 వరకు జరుగు రిలే నిరాహార దీక్షలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు నర్సింగబిల్లి పిఎసిఎస్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని నరసింగబిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు సర్వసభ్య సమావేశం బుధవారం సాయంత్రం 3 గంటలకు సంఘం కార్యాలయ ఆవరణలో పర్సన్ ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యశ్వరి అధ్యక్షతన జరుగుతుందని సంస్థ కార్యదర్శి నక్క అచ్చయ్య నాయడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరం నివేదిక, అంచనా బడ్జెట్ ఆమోదం, అడిట్ వివరాలు ఉంటాయని, సభ్యులు హాజరు కావాలని కోరారు.

28, 29 తేదీల్లో ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రథమ మహాసభ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 28, 29వ తేదీలలో జరిగే ఏఐఎస్ఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు మంగళవారం గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయుకలు బాలేపల్లి వెంకటరమణ, రాజన్న దొరబాబు మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ దేశవ్యాప్తంగా ఎన్నో విరోచిత ఉద్యమాలు నిర్వహించిందన్నారు. నేడు దేశంలో పేద వాడికి విద్య అందకుండా జరుగుతున్న ప్రైవేటీకరణకు, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బాబ్జి, జీ.ఫణీంద్ర కుమార్, జిల్లా నాయకులు జగదీష్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పలువురు అధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

జిల్లాలోని పలు మండలాల్లో నూతనంగా నియమించబడిన ఎంపిడిఒలు, తహాశీల్దార్లతో పాటు పలువురు అధికారులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.



సబ్బవరం, కె.కోటపాడు, నక్కపల్లి, భీమిలి, ఆనందపురం ఎంపిడిఒలుగా బాధ్యతలు స్వీకరించిన పి.పద్మజ, ఎ.ఎ.సాంబశివరావు, డి.సీతారామరాజు, ఎన్.హనుమంతరావు, వి.జానకి

సబ్బవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా పి.పద్మజ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన రమేష్ నాయుడు కొయ్యూరు మండలానికి బదిలీ అయ్యారు.

కె.కోటపాడు : కే కోటపాడు ఎంపీడీవోగా ఎ.ఎ.సాంబశివరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాంబశివరావు పాయకరావుపేట నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యలన పరిష్కరిస్తానని ఆయన చెప్పారు.

నక్కపల్లి : నక్కపల్లి ఎంపిడిఒగా ప్రస్తుతం ఎఒగా విధులు నిర్వర్తిస్తున్న డి సీతారామరాజుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు..ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన వి.శ్రీనివాస్ కాకినాడ జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో మండల పరిషత్ కార్యాలయం ఎఒ సీతారామరాజుకు ఎఫ్ఎసి బాధ్యలు అప్పగించారు. దీంతో మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.


భీమునిపట్నం : భీమునిపట్నం ఎండిఒగా ఎన్.హనుమంతరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నాతవరంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చిన హనుమంతరావుకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికారు. దాదాపు 8 నెలలు ఎండిఒగా ఇక్కడ పనిచేసిన డాక్టర్ వి.జానకి ఆనందపురం మండలానికి బదిలీపై వెళ్లారు.

ఆనందపురం : ఆనందపురం ఎండిఒగా డాక్టర్ వి.జానకి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. భీమిలి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆనందపురం ఎండిఒగా పనిచేసిన లవరాజు బదిలీపై అరకులోయ వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన జానకికి సిబ్బంది స్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపారు.

తహశీల్దార్లు

కె.కోటపాడు : కె.కోటపాడు తహశీల్దారుగా పనసల భాగ్యవతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇప్పటివరకు తహశీల్దారుగా పనిచేసిన జె.రమేష్‌బాబు ఎస్.రాయవరం తహసీల్దారుగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా తహశీల్దారు భాగ్యవతి మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కాపాడటమే ధ్యేయంగా తన విధులు నిర్వహిస్తానని చెప్పారు. విధి నిర్వహణలో అందరూ సహకరించాలని భాగ్యవతి కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ డి.రమేష్‌తో కలసి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కొత్తకోట : రావికమతం మండలం నూతన తహసిల్దార్‌గా బి వెంకటరమణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇంతవరకు పనిచేస్తున్న తహసిల్దార్ మహేశ్వరరావు మునగపాక మండలానికి బదిలీ కావడంతో, ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా హిరమండలం తహసిల్దార్ వెంకటరమణను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళ వారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ సమస్యలు, పనులపై తనను ప్రజలు నేరుగా కలసి, సేవలను పొందవచ్చని తహశీల్దారు తెలిపారు. తహసీల్దార్‌ను కార్యాలయ అధికారులు, సిబ్బంది, విఆర్ఒలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాం క్షలు తెలిపారు.



కె.కోటపాడు, రావికమతం తహశీల్దార్లుగా బాధ్యతలు స్వీకరించిన పి.భాగ్యవతి, బి.వెంకటరమణ

అదనపు ఎస్ఐగా భాస్కర్

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండల పోలీస్ స్టేషన్‌కు అదనపు ఎస్ఐగా నౌడు భాస్కర్ మంగళవారం విధుల్లో చేరారు. గతంలో పనిచేసిన అదనపు ఎస్ఐ ఉద్యోగ విరమణ చేయడంతో ఈ పోస్టు గత కొంతకాలంగా ఖాళీగా ఉంది. భాస్కర్ సాధారణ బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా నుండి బుచ్చయ్యపేటకు వచ్చారు.

సబ్ రిజిస్ట్రార్‌గా హర్షవర్ధన్‌రెడ్డి

భీమునిపట్నం : స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా కె.హర్షవర్ధన్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇతను నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికారు.

డిఈఈగా రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ

ఆనందపురం : ఆనందపురం మండలం విద్యుత్ శాఖ డిఈఈగా ఎస్.రాజశేఖర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రాజశేఖర్ అనకాపల్లిలో పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన కిరణ్ కుమార్ బదిలీపై మధురవాడ వెళ్లారు.



శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులతో అధికారులు

ముగిసిన టెన్నికాయిట్ క్రీడాకారుల శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 4వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం జమ్మూలో గ్రీన్ ఫీల్డ్ క్రీడా మైదానంలో జరగబోవు 36వ జాతీయ సబ్ జూనియర్ బాలబాలికల టెన్ని కాయిట్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు అనకాపల్లి గురుకుల పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 16వ తారీకు నుండి జరిగిన శిక్షణ మంగళవారం ముగిసింది. శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా క్రీడాకారులను రాష్ట్ర సంఘ చైర్మన్ పిజివిఆర్ నాయుడు అభినందించారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెన్ని కోయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అధ్యక్షులు వైడి రామారావు మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు జాతీయ క్రీడ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ అభివృద్ధి అధికారి యల్‌వి రమణ, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు ఎల్లపు గోవింద నూక అప్పారావు, పి రమణారావు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు ఎపి టెన్నికాయిట్ అసోసియేషన్ శిక్షకులు జి.రాజు, ఎంజెపి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మదన్, అంతర్జాతీయ టెన్నికాయిట్ క్రీడాకారుడు పిజెఎండి రామారావు, వి వినయ్ కుమార్ తదితరులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారి ఎల్ వి రమణ మాట్లాడుతూ జమ్మూలో జరిగే జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ క్రీడా పతాకాన్ని ఎగరవేయాలన్నారు. బాలికల విభాగంలో కె జ్యోతిక హెచ్ స్పందన, హెచ్ దీక్షిత, (అనంతపూర్) ఆర్.సంస్కృతి (పశ్చిమగోదావరి), కె.ఇందు (విజయనగరం), పి శ్రావణ (శ్రీకాకుళం), బాలుర విభాగంలో ఎన్.గౌతమ్ సంజయ్ (అనంతపూర్), ఎస్ సాయికుమార్ (విజయనగరం), కే శివ శంకర్ ప్రసాద్ (తూర్పుగోదావరి జిల్లా), జి మహీధర్ (అనంతపూర్), బి సత్యనారాయణ (తూర్పుగోదావరి), డి రోహిత్ కుమార్ (విశాఖపట్నం) జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు.

25 నుంచి చెకుముకి మండల స్థాయి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-అనకాపల్లి : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి అక్టోబర్ 1 వరకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని జెవివి మండల కన్వీనర్ బొప్పే ఉమామహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్రవ్యాప్తంగా పని చేయుచున్న సైన్సు ప్రచార సంస్థ అని తెలిపారు. ప్రజానీకంలో శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించుటకు అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వివిధ స్థాయిల్లో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీల్లో సుమారు 15 పాఠశాల నుండి విద్యార్థులు పాల్గొంటున్నారని వెల్లడించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని నర్సింగబిల్లి గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారు మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యలు గీతాంజలి, వరహాలు 85 మంది కి కంటి పరీక్షలు చేశారు. వారిలో 25 మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోన అరుణ నాగేశ్వరరావు, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ సిహెచ్ అశ్వనీకుమార్, వై పైడిరాజు, నర్సింగ్ స్టాఫ్ గిరిజా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దిబ్బిడిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామంలో మంగళవారం పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. గ్రామంలోని గల పలు వీధుల్లో మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి. మాణిక్యం, ఉప సర్పంచ్ చిన్ని పైడిరాజు, కార్యదర్శి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఎఎస్.పేటలో మంగళవారం సామూహిక సీమంతాలు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సిడిపిఓ ప్రభావతి, సూపర్‌వైజర్ వంశీప్రియపాల్గొన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -అనకాపల్లి

వివిధ ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 30న ధర్నాలు జరుగు ధర్నాలను జయప్రదం చేయాలని కోరుతూ గ్రేటర్ విశాఖ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, ఉద్యోగ భద్రత లేదని, సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పిన నేటికీ అమలు చేయలేదని పేర్కొన్నారు. పర్మినెంట్ పనుల్లో పర్మినెంట్ ఉద్యోగులతో పనిచేయించాలని ఉన్నా దీనిని ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. మున్సిపాలిటీలో పారిశుధ్య విభాగం, మలేరియా, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్, మురుగు శుద్ధి విభాగం, క్లాప్ డ్రైవర్లు క్లాప్ కాంట్రాక్టు డ్రైవర్లు తదితరులను పర్మినెంట్ కార్మికులతోనే సమానంగా పనిచేస్తున్నారని, కాని వారికి ఉద్యోగ భద్రత లేదని పేర్కొన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం మంచి ప్రభుత్వమని ప్రచారం చేస్తున్నదని, రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్ట్ వర్కర్లు అందరినీ పర్మినెంట్ చేసి మంచి ప్రభుత్వమని నిరూపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ 7వ జోన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్, అధ్యక్షులు అజయ్, నూకరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆటల పోటీల్లో ఎ.కొత్తపల్లి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఇటీవల జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో ఏ.కొత్తపల్లి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మండల స్థాయి అండర్ – 17 బాలికల విభాగం కబడ్డీ పోటీలలో మొదటి స్థానంలో గెలుపొందగా, ఖోఖోలో రెండవ స్థానంలో నిలిచారు. అండర్ 14 విభాగంలో బాలికలు కబడ్డీలో రెండవ స్థానం, ఖోఖోలో రెండవ స్థానం, చెస్ పోటీలలో రెండవ స్థానం సాధించారు. అథ్లెటిక్స్ విభాగంలో త్రోలో బాలబాలికలు 16 మెడల్స్‌ను గెలిచారు. జంపింగ్‌లో రెండు మెడల్స్‌ను సాధించారు. 9వ తరగతి విద్యార్థి పి అఖిల అన్ని విభాగాలలో ఎనిమిది మెడల్స్, ఎనిమిదో తరగతి విద్యార్థి పి.సాయికుమార్ అన్ని విభాగాలలో ఆరు మెడల్స్ సాధించారు. క్రీడలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులు అందరిని పాఠశాల పిడికె సూర్య ప్రకాష్‌ను, హెచ్‌ఎం వై.స్వర్ణలతను ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, సర్పంచ్ సత్య వెంకట్ రమణ అభినందించారు.

కెజిబివి విద్యార్థినుల ప్రతిభ

వడ్డాది : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీల్లో వడ్డాది కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేవీడిజెడ్పీహెచ్ స్కూల్లో జరిగిన ఈ పోటీల్లో కెజిబివికి చెందిన విద్యార్థులు అండర్ 14 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో ఎం రామలక్ష్మి మొదటి స్థానం, జే లావణ్య 3వ స్థానం, 200 మీటర్లలో జె లావణ్య మొదటి స్థానం, వి సింధు మూడవ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో వర్షిని రెండవ స్థానం, శ్రావ్య 3వ స్థానం, 600 మీటర్ల పందెంలో రామలక్ష్మి మూడవ స్థానం గెలుచుకున్నారు. అండర్ 17 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో వి.మహాలక్ష్మి మూడవ స్థానం, 800 మీటర్లలో స్వాతి రెండవ స్థానం, లాంగ్ జంప్‌లో మహాలక్ష్మి రెండవ స్థానం సాధించారు. ఓవరాల్ నియోజకవర్గ స్థాయిలో ఆడుతారని పిఈటి తెలిపారు గెలుపొందిన విద్యార్థులను ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, కెజిబివి ప్రత్యేక అధికారి కోసూరి అన్నపూర్ణ ఇతర సిబ్బంది తోటి విద్యార్థులు అభినందించారు.

డిగ్రీ కళాశాలలో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి- సబ్బవరం : జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించి తుప్పలు తొలగించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ నివేదిత, డాక్టర్ రత్న ప్రకాష్, డాక్టర్ సత్యనారాయణ, ఎవి రామకృష్ణ, జే.గణేష్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ గణేష్ లెక్కల పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మంగళవారం ప్రారంభించారు. గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, అంతకాపల్లి, ఆరిపాక, ఆసకపల్లి పంచాయతీల్లో చెత్త తరలింపునకు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. సబ్బవరం పిహెచ్‌సిలో రూ.50 లక్షలతో నిర్మించిన బ్లాక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కిరణ్ కుమారి, ఎంపీడీవో పి.పద్మజ, ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీ శరగడం రూప్నీ లక్ష్మి రాణి, పిహెచ్‌సి వైద్యాధికారి చక్రవర్తి, కూటమి నేతలు సాలాపు వెంకటేశ్వరరావు, బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకట రమణ, శరగడం రాము, బర్నికాన బాబురావు, రేసుపూడి రమణ, గవర అప్పారావు, ఆకుల గణేష్, దాడి కన్నం నాయుడు పాల్గొన్నారు.


పంపిణీ చేసిన ట్రాక్టర్ తోలుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

జిల్లా నేతలకు నామినేటెడ్ పదవుల పట్ల హర్షం


బత్తుల తాతయ్యబాబును అభినందిస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-వడ్డాది, బుచ్చయ్యపేట


టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబుకు రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించడంతో ఆయనకు టిడిపి నాయకులు, కార్యకర్తలు మంగళవారం అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని బుచ్చయ్యపేట, రావికమతం, చోడవరం మండలాలకు చెందిన నాయకులు మంగళవారం తాతయ్యబాబుకు సాలువాలు కప్పి సన్మానించారు. వివిధ శాఖల అధికారులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాదికి చెందిన తాతయ్యబాబు గత 30 ఏళ్లగా టీడీపీలో కొనసాగుతున్నారు. క్లిష్ట సమయంలో కూడా పార్టీ కోసం శ్రమించారు. వడ్డాది పంచాయతీ వార్డు మెంబరుగా, సర్పంచ్‌గా, బుచ్చయ్యపేట ఎంపీపీగా, జిల్లా ఆర్టీఏ మెంబర్‌గా ఆయన పని చేశారు. ఆయన సేవలను గుర్తించి తొలి జాబితాలోనే సీఎం చంద్రబాబు రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం పట్ల టిడిపి శ్రేణులు సంతోషం వ్యక్తం చేశాయి.

పీలా గోవిందకు శుభాకాంక్షలు

కశింకోట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పీలా గోవింద సత్యనారాయణకు కూటమి నాయకులు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో నాయకులు వేగి గోపికృష్ణ, నైనముశెట్టి రమణరావు, ఉల్లింగల రమేష్, కర్రి దుర్గనాయడు, కలగా సోమేశ్వరరావు, బుదిరెడ్డి గంగయ్య, సిదిరెడ్డి శ్రీను, షేక్ బాబర్, షేక్ దర్గా, ఆంధ్ర ప్రసాద్, జెర్రిపోతల నూకినాయడు ఉన్నారు.

శివ శంకర్‌కు అభినందనలు

పెందుర్తి : ఏపి మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా జనసేన నాయకుడు తమ్మిరెడ్డి శివశంకర్‌ను ప్రకటించడంతో నగరంలోని ఆయన నివాసం వద్ద సందడి నెలకొంది. నాయకులు ఎమ్.సన్యాసిరావు, పి.రామకృష్ణ, వెంకటరమణ, నానాజీ, గుంటూరు నరసింహమూర్తి, బి.రఘు, అభిమానులు కార్యకర్తలు, శ్రేయోభిలాషులు ఆయన ఇంటికి చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు.


విరాళం చెక్కు అందిస్తున్న డాక్టర్ కాశీం, ముత్యాలునాయుడు

వరద బాధితుల సహాయార్థం విరాళం అందజేత

ప్రజాశక్తి-కె.కోటపాడు : వరద బాధితులకు ఆర్థిక సాయం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి స్థానిక అయ్యన్న విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు సేకరించిన రూ.1,53,650 విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని మాడుగుల ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తికి మంగళవారం అయ్యన్న విద్యాసంస్థల ఆవరణలో విశ్రాంత వీసీ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలునాయుడు చేతుల మీదుగా విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఖాశీం అందజేశారు. విరాళాలు అత్యధికంగా సేకరించిన విద్యార్థులు జొమ్మల హేమ దుర్గాభవాని, ఎ.హెత్విక్ సాయి విహాన్, ఎన్.రేవతి, కరక శంకరరావు, సమ్మింగ చార్విక్‌లకు ఎమ్మెల్యే బండారు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు, డిసిసిబి మాజీ డైరెక్టరు చల్లా సత్యనారాయణ మూర్తి, సీఐ పైడిపునాయుడు, ఎంఈఓ కూనిరెడ్డి సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, నాయకులు కన్నూరు సూర్యనారాయణ, కశిరెడ్డి అప్పలనాయుడు, బత్తి వెంకటరమణ, సబ్బవరపు రాము నాయుడు, జూరెడ్డి రాము, పూడి నారాయణ మూర్తి, దోకల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు

ప్రజాశక్తి-అనకాపల్లి : గొర్రెల, మేకలకు నట్ల నివారణ మందులు అక్టోబర్, జనవరి, ఏప్రిల్ నెలలో ఏడాదికి మూడుసార్లు వేయడానికి ప్రణాళిక తయారు చేస్తున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామ్మోహన్ రావు తెలిపారు. అనకాపల్లి డిఆర్ భవన్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి 25 గొర్రెల మేకల షెడ్లు చొప్పున మొదటి విడతగా ఇస్తామని తెలిపారు. దీనిని సహకార సంఘం సభ్యులు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను పెంపకందారులకు అందే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్ యూనియన్ గత ఆరు నెలలు నిర్వహించిన కార్యకలాపాలను సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శీనుబాబు, పశువైద్య అధికారి డాక్టర్ భానుమూర్తి, జిల్లా వైస్ చైర్మన్ సబ్బి శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ దేవర సత్యనారాయణ, జిల్లా డైరెక్టర్లు పినిబోయిన అప్పారావు యాదవ్, బొట్ట వరహాలు, గోకాడ దేముడు నాయడు, ముచ్చ రామనాయుడు, పల్ల శ్రీరాములు, పట్నాల అప్పలరాజు, ఏదిరి అప్పారావు, వివిధ గ్రామ ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ రామ్మోహన్‌రావు

ఆడ పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-వడ్డాది : ఆడపిల్లలు దేశానికి పెట్టు కొమ్మలాంటి వారని, వారు అన్ని రంగాల్లో రాణించాలని అతిథిదేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు అరిపాక కామేశ్వరరావు అన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది మెయిన్ స్కూల్లో పుత్రిక దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని రంగాలలో ముందడుగు వేస్తున్నారని, వారిని ప్రోత్సహించాలని కోరారు. అనంతరం విద్యార్థినులకు రోగనిరోధక శక్తి పెంపుదలకు కోసం హోమియో మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీవీ శేషగిరిరావు, ఉపాధ్యాయులు లలితాంబ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న సిఐ

ప్రజాశక్తి -పరవాడ : ట్రాఫిక్ నిబంధనలపై వాహన డ్రైవర్లకు పరవాడ సిఐ ఆర్.మల్లికార్జునరావు అవగాహన కార్యక్రమం చేపట్టారు. పరవాడ సబ్‌స్టేషన్, మండల పరిషత్ కూడలి, సింహాద్రి కూడలి, రాంకీ ఎస్ఈజెడ్ కూడలి, లంకెలపాలెం తదితర ప్రాంతాల్లో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రహదారి భద్రత నిబంధనలను పాటించాలని సూచించారు. రోడ్ల పైన ఇష్టానుసారంగా వాహనాలను నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మితిమీరిన వేగంతోనూ, మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపొద్దని చెప్పారు.

చెట్టినాడ్ సిమెంట్‌కు మూడు అవార్డులు

ప్రజాశక్తి- కశింకోట : చెట్టి నాడ్ సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ గత రెండు సంవత్సరాలలో జీరో క్వాలిటీ ఫెయిల్యూర్స్‌కి గాను మూడు అవార్డులు దక్కించుకుంది. విశాఖపట్నం రామ్‌నగర్ గ్రీన్ పార్క్ హోటల్‌లో మంగళవారం జరిగిన ప్రపంచ ప్రమాణాల దినోత్సవ వేడుకలలో బిఐఎస్ డైరెక్టర్ పెద్దల నుండి కంపెనీ యాజమాన్యం అవార్డు తీసుకుంది. ఈ సందర్భంగా కంపెనీ నిర్వాహకులు మాట్లాడుతూ తమ సిమెంట్ కంపెనీ ఎప్పుడు నాణ్యతకే ప్రాధాన్యతనిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృపానాదం టీం పాల్గొన్నారు.


అవార్డులు తీసుకుంటున్న చెట్టినాడ్ ప్రతినిధులు

బహిరంగ మలవిసర్జనతో క్షీణిస్తున్న పారిశుధ్యం!

- దుర్గంధంతో పాదచారులు, వాహనదారుల అవస్థలు
- గ్రామ పంచాయతీ చర్యలకు సహకారం కరువు

ప్రజాశక్తి -కొత్తకోట : మేజర్ పంచాయతీ కొత్తకోట గ్రామశివారుల్లో బహిరంగ మల విసర్జనతో పారిశుధ్యం క్షీణిస్తోంది. దీని నివారణకు పంచాయతీ అధికారులు చేపట్టిన చర్యలకు గ్రామస్తులు నుంచి సహకారం లభించడం లేదు. కొత్తకోట నుంచి మాకవరపాలెం వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డులో స్థానిక మోదునాయుడు రైస్ మిల్లు నుంచి ప్రభుత్వ మద్యం దుకాణం, వెల్లంకి వారి వీధి, అంబేద్కర్ కాలనీ -4, అరంధతి కాలనీ, పాత పాల కేంద్రం, నాయుడు చెరువు వరకూ రోడ్డుకు ఇరువైపులా రాత్రి సమయంలో బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు. ఈ రోడ్డులో రావికమతం మండలం గ్రామాలతో పాటు రోలుగుంట, మాకవరపాలెం మండలాలకు చెందిన సుమారు 50 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాలతో పాటు కొత్తకోటకు సమీపంలో కన్నంపేట, శ్రీరామ్ నగర్ కాలనీ, వమ్మవరం, నాయుడుపా లెం,జగ్గంపేట గ్రామాల పాదచారులు రాకపోకలు చేస్తూంటారు.

దీంతో ఈ మార్గంలో పాదచారులు నడవాలంటే రోడ్డుకు మధ్యలో మినహా రోడ్డుకు ఇరువైపులా నడవ లేని దుస్థితి ఉంది. అలాగే మర్రివలస, వెళ్లే రోడ్డు లో స్థానిక చెత్త సంపద కేంద్రం సమీపంలో అయితే బహిరంగ మల విసర్జనతో పాటు చెత్త చెదారం వేయడం వలన అ రోడ్డులో ప్రయాణించే వాహన దారులు పాద చారులు తీవ్ర దుర్గందంతో నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఈ సమస్యను నివారించాలని సమీప నివాసులతో పాటు పలువురు వాహనదారులు, పాద చారులు స్థానిక పంచాయతీ అధికారులకు విన్నవించారు. దీనిపై స్పందించిన పంచాయతీ యంత్రాంగం ఆయా ప్రాంతాల్లో పరిశుభ్రతా పనులు చేపట్టి బాగుచేశారు. అయితే ప్రజలు మళ్లీ అక్కడ చెత్తాచెదార వేయడంతోపాటు బహిరంగ మలవిసర్జన చేస్తూనే ఉన్నారు.



గ్రామశివారులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

దీంతో గ్రామపంచాయతీ యంత్రాంగం చివరి ప్రయత్నంగా వివిధ మతాలకు చెందిన దేవుళ్ల ఫొటోలను ఫ్లెక్సిలుగా వేసి అక్కడ పెట్టారు. అంతేకాక బహిరంగ మలవిసర్జన అనర్థాలు, పారిశుధ్య క్షీణిస్తే వచ్చే పర్యావసానాలను తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ, బహిరంగ మలవిసర్జనకు పాల్పడుతున్న వారిలో మార్పు రాకపోవడంతో గ్రామస్తులతోపాటు పంచాయతీ యంత్రాంగం తలలు పట్టుకుంటోంది. ఇప్పటికే దీనిపై అవగాహన కల్పించినా ఫలితం లేకపోవడంతో సమస్య పరిష్కారానికి రాత్రి వేళల్లో పోలీసుల సహకారంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతోపాటు అవగాహనా సమావేశాలు నిర్వహించాలని కోరుతున్నారు..





దేవతా చిత్రాలతో ఫ్లెక్సీలు పెట్టినా కానరాని ఫలితం

నాటుసారా పులుపు ధ్వంసం



నాటుసారా పులుపు ధ్వంసం చేస్తున్న సిఐ రేవతమ్మ, పోలీసులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :మున్సిపాలిటీలోని బైయపరెడ్డిపాలెం శివారులో మూడు వేల లీటర్ల నాటుసారా పులుపు, తయారి సామాగ్రిని మంగళవారం పోలీసు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ రేవతమ్మ మాట్లాడుతూ ముందుగా వచ్చిన సమాచారం మేరకు టౌన్ ఎస్ఐ జె. రమేష్, ఇతర సిబ్బందికి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా. నాటు సారా తయారీకి సిద్ధంగా ఉన్న 3 వేల లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి తయారీ సామాగ్రిని, రెండు గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రేవతమ్మ తెలిపారు. నర్సీపట్నం రూరల్, టౌన్ ప్రాంతంలో ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మత్తు పదార్థాలు తీసుకోవడం, అమ్మకాలు చేయడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉప్పరాపల్లిలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలోని ఉప్పరాపల్లి గ్రామంలో తాటాకిల్లు దగ్ధమైంది. మంగళవారం తెల్లవారురఘూమున గ్రామానికి చెందిన సేనాపతి సత్యన్నారాయణకు చెందిన తాటాకు ఇంటికి అదే గ్రామానికి చెందిన సేనాపతి నూకరాజు అనే వ్యక్తి నిప్పంటించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఇంటిలో నివాసముండే సత్యన్నారాయణ కుటుంబం ఇటీవల నూతనంగా నిర్మించుకున్న ఇంటిలోకి వెళ్ళడంతో పెను ప్రమాదం తప్పింది. గతంలోనూ, ఇదే ఇంటికి నిప్పు పెట్టగా గ్రామస్థులంతా ఆర్పివేసారని బాధితురాలు ఆదిలక్ష్మి తెలిపింది. నిందితుడు పప్పల ప్రకాశరావు చిన్న దొంగతనాలు చేస్తూ, సైకో మాదిరి ప్రవర్తిస్తుంటాడని గ్రామస్థులు తెలిపారు. బాధితులిచ్చిన సమాచారం మేరకు యస్ రాయవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబానికి చెందిన టివి, బీరువా, ఇంటి సామగ్రి, బట్టలు, గ్రామానికి చెందిన పప్పల ప్రకాశరావుకు చెందిన టివిఎస్ ఎక్స్ ఎల్ మోటారు సైకిలు దగ్ధమయ్యాయి.

శరత్‌చంద్ర మృతిపై స్పీకర్ సంతాపం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : గజపతినగరం నియోజకవర్గ జనసేన నాయకురాలు, మాజీ మంత్రి పడాల అరుణ కుమారుడు పడాల శరత్‌చంద్ర అనారోగ్యంతో మృతి చెందడం పట్ల అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు టిడిపిలో అరుణకలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ సీతారామరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపిడిఒ సీతారామరాజు, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు

విద్యార్థుల భద్రతపై సమావేశం

ప్రజాశక్తి- కొత్తకోట :విద్యార్థుల భద్రతపైపాఠశాల యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని కొత్తకోట ఎస్ఐ ఎం శ్రీనివాస్ సూచించారు. మంగళవారం స్థానిక సెయింట్ మేరీ, ఆర్క్‌బర్డ్, విద్యాంజలి పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, పాఠశాలల వాహనాలలో పరిమి తికి మించి విద్యార్థులను తరలించడం భద్రత కాదన్నారు. వాహన డ్రైవ ర్లకు తగు సూచనలతో పాటు అవగాహన కల్పించాలన్నారు. వాహనాలకు సంబంధించి రవాణా శాఖ అధికారుల సూచనలు పాటించి అన్ని రికార్డులు సరిచేసుకోవాలని, నిర్లక్ష్యం చేయొద్దని స్పష్టం చేశారు. పాఠశాలల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆకతాయిలు వలన ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.



యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి -యంత్రాంగం

ప్రజాశక్తి -కోటవురట్ల: రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రజలను మాత్రమే కాదు, గ్రామాభివృద్ధి నిధులను దోచుకున్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని హోంమంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. మంగళవారం మండలంలో పీకే.పల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలకు జమచేసిన నిధులు రాత్రికిరాత్రే మాయం చేశారని,దీంతో గ్రామాల్లో బ్లీచింగ్ చల్లలేని దుస్థితి కల్పించారని వైసిపి పాలనపై ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జల్లూరు వంతెనకు రూ.2.50కోట్లను మంజూరు చేశామని, పొందూరు వంతెన పనులు త్వరలో చేపడతామని అన్నారు, రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని ఎట్టి పరిస్థితులను వమ్ము చేయకుండా రాష్ట్రాన్ని అన్ని రంగాలలో విజయ పథాన నడిపించడమే ఓటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతర ప్రజా సమస్యల ఫిర్యాదుల బాక్స్‌ను, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌పి దీపిక ప్రారంభించారు.

ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి,గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు.కార్యక్రమంలో ఆర్‌డిఒ జయరాం, ఎంపిడిఒ కాశీవిశ్వనాధరావు జనసేన నేత తోట నగేష్, టిడిపి జిల్లా కార్యదర్శి కాశీనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీను, జనసేన మండల అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాసు, మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ, స్థానిక తాహసిల్దారు జానకమ్మ, సిఐలు అప్పన్న, రేవతమ్మ, ఎస్ఐ రమేష్, పాల్గొన్నారు.



కోటవురట్లలో మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి అనిత

ములగాడ : జివిఎంసి 58వ వార్డు పరిధి పిలకవానిపాలెం జంక్షన్, అన్నపూర్ణానగర్‌లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రభుత్వం 100 రోజుల్లో ప్రజలకు చేసిన మంచి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ శ్రీనివాసరావు, అంగప్రశాంతి, సీరం ఉమమహేశ్వరి, పోతాబత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులా తమ ప్రభుత్వం ముందుకు పోతుందని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జివిఎంసి నాలుగో వార్డు పరిధి కాపులుప్పాడలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంపద సృష్టించి అభివృద్ధి, సంక్షేమ రంగాలకు ప్రభుత్వం తగు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేసి తీరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి, తహశీల్దార్ పి.రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

నేడు చినదొడ్డిగల్లులో 'ఇది మంచి ప్రభుత్వం'



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ, నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామంలోబుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ మండలశాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత హాజరుకానున్నారన్నారు. ఈ మేరకు ఏర్పాట్లను కూటమి నేతలతోపాటు ఎంపిడిఒ సీతారామరాజు మంగళవారం స్థానిక అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రరావు. వైస్ ఎంపిపి ఈశ్వరరావు, టిడిపి నాయకులు వెలగా శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ ,పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు .

పోర్టు ఆసుపత్రిని ప్రయివేటుపరం చేయొద్దు

సొంత నిధులతో అభివృద్ధి చేయాలి : సిఐటియు ఆధ్వర్యంలో పోర్టు చైర్మన్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి- కలెక్టరేట్ : విశాఖ పోర్ట్ హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలని, పోర్ట్ సొంత నిధులతో అభివృద్ధి చేయాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం పోర్టు చైర్మన్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కో కన్వీనర్ కె.కుమార్ మంగళం మాట్లాడుతూ, పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను 150 పడకల సామర్థ్యంతో నిర్మించి, ప్రస్తుతం 80 పడకలతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, పోర్టు, డాక్ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు, విశ్రాంత కార్మికులకు, ఫ్యామిలీ పెన్షనర్లకు, పూల్ కళాసీలకు, సిహెచ్‌డి క్యాజువల్ కార్మికులకు, సిఐఎస్ఎఫ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు చెందిన 35 వేల కుటుంబాలకు దశాబ్దాల తరబడి సేవలందిస్తుందన్నారు.

అటువంటి పోర్టు హాస్పిటల్‌ను పిపిపి పద్ధతిలో 'మల్టీ డిసిప్లైనరీ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్'గా 300 పడకలతో ప్రైవేటుకు ఇచ్చేయాలనే నిర్ణయం దుర్మార్గమన్నారు. ఈ నిర్ణయాన్ని సిఐటియు నిర్ద్వందంగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. పోర్టు ఆసుపత్రిని ప్రయివేటుపర చేస్తే, పోర్టు, డాక్‌యార్డు కార్మికుల, ఉద్యోగుల కుటుంబాలు ఆరోగ్య భద్రతను ప్రైవేటు చేతుల్లో పెట్టడమే అవుతుందన్నారు. ప్రైవేటు యాజమాన్యం దయాదాక్షిణ్యాలపై ఆధార పడాల్సి వస్తుందన్నారు. పోర్టుల్లో పిపిపి, బిఒటి విధానాలు విఫలమయ్యాయని గతంలో స్వయంగా 'కాగ్' (కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్) మొట్టికాయలు వేసిందని గుర్తు చేశారు.

కరోనా కాలంలో ప్రయివేటు ఆసుపత్రుల దోపిడి వ్యవహారాన్ని గుర్తుకు తెచ్చుకోవాలని, ఇపుడు పోర్టు ఆసుపత్రిని పిపిపి విధానంలో నిర్వహణకు అప్పగిస్తే పోర్టు, డాక్‌యార్డు ఉద్యోగులు, వారి కుటుంబాలకు అటువంటి పరిస్థితి ఎదురవ్వడం ఖాయమన్నారు. కార్మికలోకం ప్రమాదాన్ని గుర్తించి, దీన్ని తీవ్రంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

డబ్ల్యుటిడబ్ల్యుఎఫ్ఐ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ 90 ఏళ్ల విశాఖ పోర్టు ఉన్నతికి రేయింబవళ్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా చెమటోడ్చి కష్టించి అంతర్జాతీయ స్థాయికి తీసుకువచ్చిన ఉద్యోగ, కార్మిక,రిటైర్ కార్మికుల కుటుంబాలకు నష్టం కలిగించే దుర్మార్గపు ఆలోచనను పోర్టు యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు,కార్మికులు పొందే వైద్యాన్ని లాభనష్టాలు బేరీజు వేయడం సరికాదన్నారు. పోర్టు ఆసుపత్రుల విషయంలో ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు అన్ని ఫెడరేషన్ల అభిప్రాయాలు పరిగణనలోని తీసుకునే ముందుకు వెళ్తామని గతంలో ఇచ్చిన హామీని ఐపిఎ తప్పిందన్నారు..ఎపి హైకోర్టు కూడా హాస్పిటల్ విషయమై కార్మిక సంఘాల అభిప్రాయాలను తీసుకోవాలని చెప్పిందని గుర్తు చేశారు. కార్మికులు, కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా గోల్డెన్ జూబ్లీ హాస్పటల్ ప్రైవేటుకు ఇవ్వడానికి యాజమాన్యం, ప్రభుత్వం ముందుకెళ్లడం అప్రజాస్వామికమని విమర్శించారు. కార్యక్రమంలో యునైటెడ్ పోర్ట్, డాక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి. రామలింగేశ్వర రావు, విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జక్కన్న సత్యనారాయణ, బి. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నేత కుమార మంగళం

గాన గంధర్వునికి ఘన నివాళి



బాలుకు నివాళులర్పిస్తున్న అభిమాన సంఘం సభ్యులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: గాన గంధర్వులు స్వర్గీయ ఎస్‌పి.బాల సుబ్రహ్మణ్యం నాల్గవ వర్ధంతిని దొండపర్తి ఎస్‌పి.బాలు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎస్‌పి.బాలు అభిమాన సంఘం సభ్యుల బాలు చిత్రపటానికి పులమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రైల్వే కబడ్డీ కోచ్ కబ్బడి శ్రీను, ఎస్.పి.బాలు అభిమాన సంఘం సభ్యులు శర్మ ఆప్టికల్స్ వాసు, వెంకీ, సాయి, సంతోష్, శ్రీను, శంకర్, మురళి, జివి రమణ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రునికి వైసిపి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి -కోటవురట్ల: ఇటీవల అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా ప్రమాదంలో గాయపడిన బాధితుడు బోడపాలేనికి చెందిన జీరెడ్డి కాశీనాయుడుకు వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు పాయకరావుపేట ఇన్చార్జి కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ పివి సూర్యనారాయణ రాజు సాయం చెక్కును బాధితునికి అందజేశారు, కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ ఎరుపు నాయుడు, సహా పలువురు వైసిపి నాయకులు సర్పంచ్ ఎంపిటిసి, సహా పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శాస్త్రి

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవం (ఎన్ఎస్ఎస్ డే) ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివిఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ పాత్ర కీలకమైందని కొనియాడారు.

వైస్ ప్రిన్సిపల్ జయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్‌లో సభ్యత్వం పొందాలని విద్యార్థులకు సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం రామ్‌కుమార్ ఎన్ ఎస్ ఎస్ పుట్టుపూర్వోత్తరాలను విద్యార్థులకు వివరించారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పులవర్తి పైడిరాజు, డాక్టర్ షర్మిలశ్రీ, డాక్టర్ ఆర్‌వి. రమణమూర్తి, డాక్టర్ బి అప్పలనాయుడు, బి రాజు బి నారాయణ కామర్స్ నాగేశ్వరరావు ఎకనామిక్స్ నాగేశ్వరరావు బోధనేతర సిబ్బంది సులేమాన్, దాసరి శ్రీనివాసరావు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : భగత్‌సింగ్ జయంతి పురస్కరించుకొని మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ జీ.గీతాకృష్ణ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో పోరాటస్ఫూర్తితో పాటు విజ్ఞానం, వినోదం కూడా ఉండాలన్నారు. నేటి రోజుల్లో స్మార్ట్‌ఫోన్లకు అలవాటై, ఎంతో మంది విద్యార్థులు సాంప్రదాయ ఆటలకు దూరమై పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలోనే భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వినోదాన్ని పంచడానికి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. యువత, విద్యార్థులు మత్తుకు బానిసలు కాకుండా చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి, భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు రాజు, మోహన్, స్వామి, వరహాలు, భార్గవ్, విష్ణు, జైకృష్ణ, రమణ, విద్యార్థులు పాల్గన్నారు.

గైర్హాజరు అధికారులపై ఫిర్యాదు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి గైర్హాజరు అయిన మండల అధికారులపై ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ సత్యన్నారాయణ తెలిపారు. మంగళవారం ఉదయం ఎంపిపి కోన లోవలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ శాఖల సమీక్ష నిర్వహించారు. దీనిలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ విభాగం సమీక్షలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరుపై పలువురు ప్రజా ప్రతినిధులు సమావేశంలో ఫిర్యాదు చేశారు. సర్వసిద్ధి ఆరోగ్యకేంద్రం నుండి సమావేశానికి రావలసిన డాక్టర్లు సమ్మెలో ఉన్నందున, ఎంపిహెచ్ఒ రావాల్సి ఉంది. ఆయన సెలవులో ఉన్నందున సిబ్బంది వచ్చి సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితి రావడంతో ఇంఛార్జ్ ఎంపిడివో సత్యన్నారాయణ కలుగ చేసుకుని సమావేశానికి హాజరయ్యే ప్రతి అధికారి పూర్తి సమాచారంతో రావాలని సూచించారు. సర్వసిద్ధి సిబ్బంది పనితీరుపై తరచూ ఫిర్యాదులొస్తున్నాయని, వాటిపై జిల్లా వైద్యాధికారికి నివేదిస్తామన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారికి మెమో జారీ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆర్ డబ్ల్యుఎస్, వ్యవసాయశాఖ తదితర శాఖల నివేదికలు సమీక్షించారు. అయితే ప్రతి సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై అధికారులు తూతూమంత్రంగా సమాధానం చెప్పడం తప్ప, తదుపరి సమావేశంలో వేటిని పరిష్కరించారో తెలియచేయకపోవడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ వచ్చే సమావేశం నుండి మొదట అజెండాగా గత సమావేశాల్లో లేవనెత్తిన సమస్యలపై పరిష్కార చర్యలను అజెండాలో చేర్చి ముందుగా చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దారు కె కుమార స్వామి, జెడ్పీటిసి కాకర దేవి, వైస్ ఎంపిపిలు బొలిశెట్టి గోవిందు, అప్పన్న ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం మండల సమావేశం



మండల సభలో శాఖలవారీ నివేదికలు వివరిస్తున్న అధికార్లు